## ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరగొద్దు

**కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి**



తాండూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 18: ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకంలో అవకతవకలు జరుగొద్దని కాంగ్రెస్ కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి అన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్‌లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతులకు తెల్ల కాగితంపైన కాకుండా రశీదులు ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలన్నారు. ఆయనవెంట కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి, తాండూర్ పీఏసీఎస్ చైర్మన్ గంగారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు శ్రీధర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## నిర్వహణపై నిర్లక్ష్యం

- నర్సరీల్లో ఎండుతున్న మొక్కలు
- గ్రీన్ షెడ్లు ఏర్పాటు చేయని వైనం
- అధికారుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం





ఇలేగావ్‌లోని విలేజ్ నర్సరీ



నర్సరీలో ఎండిన, కాలిపోయిన మొక్కలు

డోంగ్లీ, ఏప్రిల్ 18: హరిత తెలంగాణగా మార్చాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచారు. వాటిని ప్రతి వానకాలం హరితహారం కార్యక్రమం చేపట్టి నాటే విధంగా చర్యలు తీసుకున్నారు. నర్సరీల్లో పెరిగిన మొక్కలను ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలు, పల్లె ప్రకృతి వనాలు, శ్మశాన వాటికలు, డంపింగ్ యార్డుల్లో నాటడంతోపాటు అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టారు. అప్పట్లో నాటిన మొక్కలు ప్రస్తుతం ఏపుగా పెరిగి పచ్చదనాన్ని, ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. పల్లెవాసులకు స్వచ్ఛమైన ప్రాణవాయువును అందిస్తున్నాయి.

**లక్షా 20వేల మొక్కల సరఫరా కోసం..**

ఈ సంవత్సరం కూడా గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలో మొత్తం లక్షా 20వేల మొక్కలను పెంచాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు విలేజ్ నర్సరీల్లో మొక్కల పెంపకం కొనసాగుతున్నది. కానీ అధికారుల పర్యవేక్షణ లోపంతో హరితహారం కార్యక్రమానికి మొక్కలు అందుబాటులో ఉంటాయా అన్న సందేహం కలుగుతున్నది. ఎండలు తీవ్రంగా ఉండడం, నర్సరీలకు నీటి వసతి లేకపోవడం, మొక్కల సంరక్షణకు గ్రీన్ షెడ్లను ఏర్పాటు చేయకపోవడమే ఇందుకు కారణమని మండల ప్రజలు అంటున్నారు. జూన్ నెల వరకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు సరఫరా చేస్తారా అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు. నర్సరీల నిర్వహణపై అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**ఇలేగావ్ నర్సరీలో కాలిపోయిన మొక్కలు..**

మండలంలోని ఇలేగావ్ నర్సరీలో పది వేల మొక్కల పెంపకం కోసం ఏర్పాట్లు చేశారు. విత్తనాలు నాటినా వాటిలో కొన్ని మొలకెత్తలేదు. మరికొన్ని మొక్కలు కాలిపోయాయి. ఈ విషయమై గ్రామ కార్యదర్శి ప్రవీణ్‌ను వివరణ కోరగా.. నాసిరకం విత్తనాలు రావడంతో మొలకెత్తలేదన్నారు. నర్సరీలో మంట ఎలా వ్యాపించి మొక్కలు కాలిపోయాయో తెలియదన్నారు.

## వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

మద్నూర్, ఏప్రిల్ 18: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డోంగ్లీ పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీలేఖ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను తనిఖీ చేశారు. టీకాలు, గర్భిణులు, బాలింతలకు సంబంధించిన వివరాలను వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లను అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటించాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. ఆమెవెంట వైద్య సిబ్బంది ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న వైద్యురాలు శ్రీలత

## డ్రైనేజీలో పసికందు మృతదేహం లభ్యం

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 18: లింగంపేట మండలం ఐలాపూర్ గ్రామంలో గురువారం మురికి కాలువలో పసికందు మృతదేహం లభించింది. డ్రైనేజీలో మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని వ్యక్తులు మగశిశువును తీసుకువచ్చి మురికికాలువలో పడేసినట్లు గ్రామస్తులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. రెండు రోజుల క్రితం శిశువును మురికికాలువలో పడేసినట్లు తెలిపారు. స్థానిక ఎస్సై చైతన్య కుమార్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పసికందు మృతదేహాన్ని డ్రైనేజీలో నుంచి తీయించి కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ విషయమై ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్ నాయక్ లింగంపేట్ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని విచారణ చేపడుతున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవీందర్ నాయక్ తెలిపారు.

## హాస్టల్ విద్యార్థులకు నేత్ర పరీక్షలు

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 18: ఎల్లారెడ్డిలోని మైనార్టీ గురుకుల పాఠశాల హాస్టల్ విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్య పరీక్షలను నిర్వహించారు. శిబిరంలో 136 మంది విద్యార్థులను పరీక్షించగా.. వారిలో నలుగురికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. వారికి కంటి అద్దాలను అందజేయనున్నట్లు నేత్ర వైద్య సహాయ అధికారి హరికిషన్‌రావు తెలిపారు. ఒక విద్యార్థికి మెల్లకన్ను లోపం ఉన్నట్లు గుర్తించి హైదరాబాద్‌లోని సరోజినిదేవి కంటి దవాఖానకు సిఫారసు చేసినట్లు చెప్పారు. కంటి సమస్యలు ఉన్న 11 మందితోపాటు విటమిన్ 'ఏ'లోపం ఉన్న ఇద్దరు విద్యార్థులకు అవసరమైన మందులు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో మత్తమాల దవాఖాన వైద్యుడు శరత్‌కుమార్, డాక్టర్ సంజయ్, ఫార్మాసిస్ట్ రవితేజ, ఏఎన్ఎంలు ఇందిర, సుమిత్ర, ఆశ వర్కర్లు సంధ్య, సవిత, పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను పరీక్షిస్తున్న నేత్ర వైద్యుడు



శ్రమదానంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

## ఎన్ఎస్ఎస్ వలంటీర్ల 'స్వచ్ఛ భారత్'

బిచ్కుంద, ఏప్రిల్ 18: మండలంలోని పెద్ద దేవాడ, పుల్కల్ గ్రామాల్లో బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గురువారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ చంద్రముఖర్జీ, ఎన్ఎస్ఎస్ అధికారులు వెంకటేశం, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి



రామారెడ్డి దవాఖానలో వైద్యుడితో మాట్లాడుతున్న ఎంపీడీవో సవితారెడ్డి

రామారెడ్డి, ఏప్రిల్ 18: ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని ఎంపీడీవో సవితారెడ్డి స్థానిక వైద్యుడు సురేశ్‌కుమార్‌కు సూచించారు. మండల కేంద్రంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయని తెలిపారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున కూలీలు డీహైడ్రైషన్‌కు లోనవ్వకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్ అందుబాటులో ఉంచాలన్నారు. ఏపీవో ధర్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి క్రాంతికుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## పశు సంచార అంబులెన్స్ తనిఖీ



పశు సంచార అంబులెన్స్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

కామారెడ్డి, ఏప్రిల్ 18 : కామారెడ్డి జిల్లా 1962 వాహనాలను గురువారం అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పశు సంచార అంబులెన్స్‌ల ప్రాజెక్టుల సమన్వయకర్త డాక్టర్ భగీశ్ మిశ్రా ఆధ్వర్యంలో జిల్లాలోని 1962 మూగ జీవాల అంబులెన్స్‌ను తనిఖీ చేసి, వైద్య సేవల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించి, మూగజీవాలకు మెరుగైన సేవలను అందించాలని వివరించారు. వాహనాల్లోని పరికరాలు, మందులు, రికార్డులను పరిశీలించారు. సిబ్బంది అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. మరింత మెరుగైన పని తీరు కనబర్చాలని సూచించారు. కార్యక్రమంలో పీఎం రవి, ఈఎంఈ లింగాచారి, సిబ్బంది పైలట్ గంగాధర్, పారావెట్ రమ్య, హెల్పర్ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## వార్డు కమిటీ సభ్యులు ఎన్నిక

కామారెడ్డి, ఏప్రిల్ 18 : కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ ఆదేశాల మేరకు పట్టణంలోని 28 వ వార్డు కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్డు వైస్ ప్రెసిడెంట్‌గా జావిదుద్దీన్, జనరల్ సెక్రటరీగా రాజశేఖర్, ప్రచార కార్యదర్శిగా ఖలీల్, కోశాధికారిగా ప్రవీణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా, కార్యవర్గ సభ్యులుగా ఖాజీ పాషా, సాయిగౌడ్, శాబీర్, హయన్, అదాన్, జాహిద్, రాజు, లక్ష్మణ్, మహిళా అధ్యక్షురాలిగా సుమలత, వైస్ ప్రెసిడెంట్‌గా రాధా, స్వామిని నియమించనట్లు తెలిపారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

మాచారెడ్డి, ఏప్రిల్ 18 : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గోపిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు, అధికారులు ఉదయం 11 గంటలలోగా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

## కొనసాగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు



కామారెడ్డిలో రైస్‌మిల్లర్లకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది




జుక్కల్‌లో ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

**■ ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించిన అధికారులు**

మద్నూర్/కామారెడ్డి, ఏప్రిల్ 18: అగ్నిమాపక వారోత్సవాలు కొనసాగుతున్నాయి. మద్నూర్‌లోని ఫైర్ స్టేషన్ సిబ్బంది గురువారం జుక్కల్‌లో ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది వినియోగదారులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అకస్మాత్తుగా అగ్ని ప్రమాదం సంభవిస్తే ఏమి చేయాలి..? గ్యాస్ సిలిండర్‌ను ఎలా ఉపయోగించాలనే విషయాలను వివరించారు. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు. కార్య క్రమంలో ఫైర్ సిబ్బంది నర్సింహులు, వెంకన్న, రాణాప్రతాప్ తదితరులు ఉన్నారు. కామారెడ్డిలోని రైస్ మిల్లుల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా అగ్ని మాపక సిబ్బంది సయ్యద్ మహమూద్ అలీ మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించామని అన్నారు. కార్యక్రమం లో అగ్నిమాపక, రైస్‌మిల్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్





వివరాలను నమోదు చేసుకున్న ఫౌండేషన్ సభ్యులు

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 18 : పట్టణంలోని యశోద దవాఖానలో గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ బాన్సువాడ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్, మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన 150 మందికి ఉచిత పరీక్షలు నిర్వహించడంతోపాటు ప్రాథమిక చికిత్సకు సంబంధించిన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ బాన్సువాడ అధ్యక్షుడు అంజిరెడ్డి, డాక్టర్ రవీంద్రనాథ్ సూరి, గ్రేస్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ సభ్యులు, శ్రీనివాస్, శివదయాల్ శర్మ, బాన్సువాడ ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ సభ్యులు వెంకటి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ర్యాలీని విజయవంతం చేయాలి

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 18 : బహుజన పరివర్తన ర్యాలీకి భారీ సంఖ్యలో బహుజనులు తరలి వచ్చి విజయవంతం చేయాలని బహుజన నాయకుడు బంగారు మైసయ్య పిలుపునిచ్చారు. బాన్సువాడ ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో బహుజన పరివర్తన ర్యాలీ కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెలలో పలువురు బహుజనుల పుట్టిన రోజులను పురస్కరించుకొని 20వ తేదీన బహుజన పరివర్తన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బాన్సువాడ బహుజన నాయకులు పాండురంగం, సాయిలు, నర్సింహులు, ఆంజనేయులు, వినోద్, సుధీర్, పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

కామారెడ్డి, ఏప్రిల్ 18 : జిల్లా కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పట్టణ సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం సీఎస్ఐ చర్చి కాంపౌండ్‌లో సుమారు 30 నుంచి 40 ఏండ్ల వయస్సున్న ఓ గుర్తు తెలియన వ్యక్తి శవం లభ్యమైనట్లు తెలిపారు. తెలుపు రంగులో ఉండి ఎడమ చేతిపై హార్ట్ సింబల్, ఒక వైపు ఎస్, మరో వైపు ఆర్ లెటర్స్ ఉన్నాయని తెలిపారు. మెడలో రుద్రాక్ష మాల ఉందన్నారు. ఎరుపు రంగు నిండు చేతుల టీ షర్ట్, నలుపు రంగు జీన్స్ ధరించాడని తెలిపారు. మృతదేహాన్ని కామారెడ్డి ఏరియా దవాఖానలోని మార్చురిలో ఉందన్నారు. ఆచూకీ తెలిసిన వారు కామారెడ్డి పట్టణ పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## కోచింగ్ సెంటర్‌ను మూసివేయాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి సురేశ్

కామారెడ్డి, ఏప్రిల్ 18 : జిల్లా కేంద్రంలో అనుమతి లేని కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి సురేశ్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్ పరీక్షలు ముగియడంతో విద్యార్థుల కోసం ఎలాంటి అనుమతులు లేకుండా కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారని తెలిపారు. వేలాది రూపాయలు తీసుకుంటున్నారని అన్నారు. అనుమతి లేని కోచింగ్ సెంటర్‌లపై చర్యలు తీసుకొని వాటిని మూసి వేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బాలాజీ, రవి, అఖిల్, అనిల్ పాల్గొన్నారు.

## అంత్యక్రియల కోసం ఆర్థికసాయం



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి ఇంతియాజ్, సిబ్బంది

బీబీపేట్, ఏప్రిల్ 18 : మండలంలోని తుజాల్‌పూర్ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పి.మల్లవ్వ అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇంతియాజ్, పంచాయతీ సిబ్బందితో కలిసి బాధిత కుటుంబానికి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందజేసినట్లు తెలిపారు.

## సరుకులు అందజేత

భిక్కనూరు, ఏప్రిల్ 18 : మండలంలోని కాచాపూర్‌లో ఉన్న అనాథలకు అమ్మ ఫౌండేషన్ సభ్యులు నిత్యావసర సరుకులను అందజేశారు. కాచాపూర్‌కు చెందిన వడ్ల మంగయ్య తన ఇద్దరు కుమారులు కొద్ది రోజుల క్రితం మృతి చెందారు. మంగయ్య తల్లి, భార్య, ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. వారికి రెండు నెలలకు సరిపడా కిరాణ సామన్లు, బియ్యాన్ని అమ్మ ఫౌండేషన్ సభ్యులు గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మంగయ్య కుటుంబ సభ్యులకు సరుకులు అందజేస్తున్న అమ్మ ఫౌండేషన్ సభ్యులు

## ఆకట్టుకున్న కుస్తీ పోటీలు

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 18 : మండలంలోని నాచుపల్లి రామాలయం ఆవరణలో గురువారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నుంచి వచ్చిన మల్లయోధులు పాల్గొనడంతో పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీల్లో గెలుపొందిన మల్లయోధులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో భారీ జాతర వెలసింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



నాచుపల్లి రామాలయం ఆవరణలో కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు